క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిశీలన



పాన్‌గల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం తహసీల్దార్ సుభాష్‌నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో రోగులకు అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. దీంతో పాటు ఎండలు తీవ్రంగా ఉండటంతో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సీఐ కేఎస్ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక గాంధీచౌక్, చెరువుకట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. నగదుకు సంబంధించిన పూర్తి ధ్రువపత్రాలు ఉండాలని సూచించారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పాన్‌గల్: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పక రావాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని చిక్కేపల్లి ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కాశన్న, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పరీక్ష పత్రాల పంపిణీ



ఖిల్లాఘనపురం: ప్రభుత్వ పాఠశాలల్లో త్వరలో జరిగే ఎస్‌ఏ 2 పరీక్షలకు సంబంధించిన పరీక్ష పత్రాలను మంగళవారం ఎంఈఓ ఉషారాణి ఆధ్వర్యంలో హెచ్‌ఎంలకు అందజేశారు. 1 నుంచి 9వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ మీడియం ఎస్‌ఏ2 పరీక్ష పత్రాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తామని కాంప్లెక్స్ హెచ్‌ఎంలు శ్రీనువాసులు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధారాణి తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మార్సీ ఇన్‌చార్జ్ అర్జున్ అన్ని పాఠశాలలకు పరీక్ష పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మానాజీపేట పీఈటీ, సీఆర్పీలు రాములు, వెంకటేష్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద వసతులు కల్పించండి



అమరచింత: పట్టణంలోని ఈద్గా వద్ద పవిత్ర రంజాన్ నమాజు కోసం వస్తున్న భక్తులకు వసతులు కల్పించాలని జామీయా మసీదు కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈద్గా ప్రాంగణం ముళ్లపొదలతో నిండుకుందని, వాటిని శుభ్రపర్చడంతో పాటు నీటి వసతిని ఏర్పాటు చేయాలని కోరారు. పవిత్ర ప్రార్థన కోసం వస్తున్న ముస్లిం మైనార్టీల కోసం నీడ సౌకర్యం కల్పించాలన్నారు. రంజాన్ సందర్భంగా ఈద్గా వద్ద సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అన్సారీ, తౌఫిక్, అస్సు తదితరులు పాల్గొన్నారు.

పాతబోర్లకు మరమ్మతు

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, పెద్ద ఆముదాలపాడు, అమరవాయి, చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాలలో పాతబోర్లకు మర్మతులు చేస్తున్నామని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, మిషన్‌భగీరథ ఏఈ రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో నీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. గ్రామంలో నీటీ ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. గ్రామంలో ఏవైనా పాత బోర్లు నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తొలగిస్తాం

- రాష్ట్ర ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి
- మండల సర్వసభ్య సమావేశానికి హాజరు



మాట్లాడుతున్న ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

ఖిల్లాఘనపురం: ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధ్యక్షుడు కృష్ణానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా చిన్నారెడ్డితో పాటు జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి హాజరయ్యారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు నివేదికలను సభలో వినిపించారు. ముఖ్యంగా విద్యుత్, వైద్యం, విద్య, ఉపాధిహామీ, పశువైద్యం, తాగునీటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మండలంలో ఏఏ గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నాయో నివేదిక తయారు చేసి పంపాలని అధికారులకు సూచించారు.

రూ.140కోట్లు మంజూరు

రాష్ట్రంలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రాంతాలకు రూ.100 కోట్లు, మున్సిపాలిటీలకు రూ.40 కోట్లు మొత్తం రూ.140 కోట్ల నిధులను విడుదల అయ్యాయన్నారు. కొత్తగా బోర్లు వేసే కంటే గ్రామాల చుట్టు పక్కల రైతులకు చెందిన బోరుమోటార్లను లీజుకు తీసుకునేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్కడి నుంచి తాత్కాలికంగా పైపులైను ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. బోరుబావిని లీజుకు ఇచ్చిన రైతుకు నెలకు రూ.5 వేలు చెల్లించాలని సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం మండలానికి ఎస్‌డీఏఎఫ్ నిధులు రూ.51 లక్షలు మంజూరు చేసిందని, మరో రూ.13.65 లక్షల నిధులకు అధికారులు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పైపులైన్లు, వాటర్ ట్యాంకులను ఉపయోగించుకోవాలన్నారు.

మరమ్మతులు చేయాలి

వేసవి సెలవుల్లోనే అన్ని పాఠశాలలు, ఆస్పత్రుల్లో మైనర్ రిపేర్లు, తాగునీరు, విద్యుత్ తదితర సమస్యలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ముఖ్యమైన సమస్యలు రేషన్‌కార్డులు, ధరణిలో మార్పులు, గృహజ్యోతి తదితర పథకాల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల నుంచి రాష్ట్ర స్థాయి వరకు చేపట్టిన పనులకు సంబంధించి రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయని తెలిపారు. కోడ్ ముగిసిన తరువాత ఓ ప్రణాళిక ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిధులు విడుదల చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్యల పరిష్కారం కోసం అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం పలువురు నాయకులు చిన్నారెడ్డిని శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను ఆశ్రయించొద్దు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న పీఏసీఎస్ సీఈఓ జగదీశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి పీఏసీఎస్ సీఈఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. పీఏసీఎస్ పెద్దమందడి ఆధ్వర్యంలో మండలంలోని పామిరెడ్డిపల్లిలో మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 ప్రభుత్వం ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని కోరారు. రైతులు ధాన్యాన్ని విక్రించేందుకు భూమి పట్టా పాస్ బుక్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్, ఏఈఓ ధృవీకరణ పత్రం అందజేయాలన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో మహిళా సంఘం మండల అధ్యక్షురాలు లక్ష్మి మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర ఏ రకం రూ.2203లు, బి రకం రూ.2183లు ఇస్తుందని పేర్కొన్నారు. రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, అకౌంట్, పాస్‌బుక్ కూడ తీసుకొని రావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సీసీ మంతమ్మ, సునీత, భగవంత్, మురళి, రైతులు పాల్గొన్నారు.

'వడ్డెర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చాలి'

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం వడ్డెర ఫెడరేషన్‌ను వడ్డెర కార్పొరేషన్‌గా మార్చడంతో పాటు పాలక మండలిని నియమించాలని జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు దాసర్ల భూమయ్య అన్నారు. మంగళవారం మండలానికి వచ్చిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డిని కొందరు నాయకులతో కలిసి వడ్డెరుల సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖిల్లాఘనపురం మండల వడ్డెర సంఘం భవనానికి నిధులు మంజూరు చేయాలని, వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, జిల్లాలో వడ్డెరులకు గుట్టల్లో రాయి కొట్టుకోవడానికి ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయాలని చిన్నారెడ్డిని కోరారు. ఈ విషయంలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాత బస్టాండ్ పునఃప్రారంభించాలి



మాట్లాడుతున్న సతీష్‌యాదవ్

పెబ్బేరు రూరల్: వనపరి పట్టణంలోని పాత బస్టాండ్‌ను త్వరగా పునఃప్రారంభించాలని అఖిలపక్ష ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్టాండ్ ఆవరణలో ఉన్న చైనా బజారు తీసివేయాలని ఆర్టీసీ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వనపర్తి సంస్థానాధీశులు రాజరామేశ్వరరావు బస్టాండ్ కోసం ఇచ్చిన స్థలాన్ని కొందరు ఆక్రమించగా.. దానిపై మూడేళ్లుగా అఖిలపక్ష ఐక్యవేదిక ద్వారా పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యులు గంధం నాగరాజు, గోపాల్, వైశాలి హోటల్ ప్రభాకర్‌రెడ్డి, రాములు, పాష, శివకుమార్, గంధం శ్రీను, వెంకటయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలకు మంటలు



తగులబడుతున్న చెత్తను ఆర్పుతున్న మున్సిపల్ కార్మికుడు

అమరచింత: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో టీ హోటల్‌కు చెందిన వ్యర్థాలను పారవేయడమే కాకుండా వాటిని తగులబెట్టడంతో మంటలు పక్కనున్న చెట్లకు వ్యాపించాయి. విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు వాటర్ ట్యాంకును తీసుకెళ్లి మంటలను ఆర్పేయడంతో పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి కాకుండా నివారించగలిగారు. ప్రతినిత్యం చెత్త వాహనాలు వస్తున్నా కొంతమంది హోటల్ యాజమానులు, ఇంటి యాజమానులు హైస్కూల్ మైదానంలో చెత్తను పారవేస్తున్నారని మండిపడ్డారు. అలాంటి వారి వివరాలను సేకరించి మున్సిపల్ ద్వారా జరిమానలు విధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ సిబ్బంది చిన్న తెలిపారు.

కలెక్టర్ ఆదేశించినా ఫలితం శూన్యం



అమరచింతలోని డంపింగ్‌యార్డు

అమరచింత: పట్టణ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు వల్ల 132 విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటు చేనేత ఉత్పత్తుల సంఘంలో పనిచేస్తున్న కార్మికులకు దుర్వాసన వస్తుందని, వీటిని వెంటనే తొలగించాలని కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించినా ఇప్పటి వరకు వాటిని తరలించలేకపోయారు. అప్పటి కలెక్టర్లు శ్వేతామహంతి, షేక్‌యాస్మీన్‌బాషా సైతం ఇక్కడి నుంచి డంపింగ్ యార్డును తరలించాలని ఆదేశాలు జారీచేసినా ఫలితం లేదు. తాజాగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ చెప్పినా మున్సిపల్ పాలకవర్గంతో పాటు కమిషనర్ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని తొలగించాలని కోరుతున్నారు.

శ్రీశైల క్షేత్రానికి బారులు దీరిన భక్తులు



అలంపూర్ రూరల్: శ్రీశైల క్షేత్రంలోని మల్లికార్జున స్వామి దర్శనార్థం మహరాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి దర్శనార్థం భక్తులు వేలాది అలంపూర్ క్షేత్రం నుంచి బయలు దేరుతున్నారు. భక్తుల కోసం మంటిస్సోరి పాఠశాల యాజమాన్యం వారు మజ్జిగా, చల్లటి నీటి ప్యాకెట్లను అందజేస్తూ పలువురి మన్ననలను పొందుతున్నారు. జెడ్పీటీసీ శంషాద్ ఇస్మాయిల్ పాదయాత్ర చూసుకుంటూ వచ్చే భక్తులకు స్వేదతీరేందుకు షామియాన వేయించి వారికి చల్లని నీళ్ల అందిస్తున్నారు. భక్తుల వల్ల అలంపూర్ రద్దీతో కిక్కిరిస్తోంది. టిఫిన్ హోటల్స్, చాయ్‌దుకాణాల దగ్గర, కిరణం షాపుల దగ్గర రద్దీ నెలకొంటుంది. భక్తులు వందలాది కిలోమీటర్ల పాదయాత్ర చేసుకుంటు శ్రీశైలానికి బయలుదేరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

వనపర్తి టౌన్: బీజేపీలోని సీనియర్ నాయకులు ఆగుపోగు కుమార్, శంకర్ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని, దీనిని ప్రతిపక్ష నాయకులు గుర్తిస్తూ కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. దోపిడీ, అక్రమాలు అని కాకుండా అభివృద్ధి, సంక్షేమం అనే ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తుందని తెలిపారు. కార్యక్రమంలో బి.కృష్ణ, పరశురాం, యాది, భాస్కర్, నాగరాజు, రాగివేణు, చిట్యాల సురేష్, దివాకర్, రోహిత్, నరసింహ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'తైబజారు' సిబ్బందికే చెల్లించాలి



ఆత్మకూర్: మున్సిపాలిటీ తైబజారు రుసుమును కాంట్రాక్టర్‌కు కాకుండా మున్సిపల్ సిబ్బందికే చెల్లించాలని కమిషనర్ నాగరాజు వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో తైబజారు వేలం నిర్వహించలేకపోతున్నామని, మార్చి 31 నాటికే తైబజారు వసూళ్లకు సంబంధించి గుత్తేదారు కురుమూర్తి కాలపరిమితి ముగిసిందన్నారు. వ్యాపారుల నుంచి తైబజారు రుసుమును వసూలు చేసేందుకు సిబ్బందిని కేటాయించామని వారికే తైబజారు రుసుమును చెల్లించాలని కోరారు. అలాగే ఇంటి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

అడ్డాకుల: విద్యారంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుతో పాటు ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా నరేష్, కార్యదర్శిగా జీవరత్నంలను ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో బాలరాజు, ప్రసాద్, సంతోష్ ఉన్నారు.

నేటినుంచి వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు



ప్రతిష్ఠకు సిద్ధంగా వేంకటేశ్వరస్వామి విగ్రహం

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి స్వయంభు వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 200ఏళ్ల కిందట నుంచి గ్రామంలో స్వయంభు వేంకటేశ్వరుడిగా (గుండు) పూజలు పూజలు చేస్తుండేవారు. ఐదేళ్ల క్రితం గ్రామస్తులందరూ చందాలు పోగు చేసి ఆలయాన్ని నిర్మించుకున్నారు. నేటి నుంచి మూడు రోజుల ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు, మొదటి రోజు విగ్రహాల ఊరేగింపు, జలాధివాసం, ధాన్యధివాసం, హోమాలు, రెండో రోజు అభిషేకం, అలంకరణ విగ్రహాల ప్రతిష్ఠ, కల్యాణోత్సవం, కుంకుమార్చన, మూడో రోజు అఖండ భజన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

వడదెబ్బ నివారణపై ప్రజలను చైతన్యం చేయాలి



మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ రామయ్య

పాన్‌గల్: ఎండలు తీవ్రంగా ఉండటంతో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యం చేయాలని పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించడంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. గర్భిణుల పేర్లు నమోదు, కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, పౌష్టికాహారం, రక్తహీనత గురించి వివరించాలన్నారు. పీహెచ్‌సీలోనే కాన్పులు అయ్యేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ సంతోషమ్మ, సిబ్బంది రాంచందర్, సతీష్, ఏఎస్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

లీకేజీలను అరికట్టాలి



లీకవుతున్న మిషన్ భగీరథ పైపులైన్

కోడేరు: మండల కేంద్రంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రం ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. దాదాపు 15 రోజులు కావొస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధాన రోడ్డు పక్కల నీరు కలుషితం అవుతోందని దీంతో రోగాలబారిన పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్‌భగీరథ నీటి లీకేజీలకు మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోరు డ్రిల్లింగ్‌ను అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు



ఫారెస్టు అధికారులతో వాగ్వాదం చేస్తున్న సోమశిల గ్రామ ప్రజలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల గ్రామ సమీపంలో తాగునీటి సమస్యను తీర్చడానికి ఆర్‌డబ్ల్యూఎస్ నిధులతో పంచాయతీ అధికారులు పల్లె పకృతి వనంలో వేస్తున్న తాగునీటి బోరు డ్రిల్లింగ్‌ను స్థానిక ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారు. ఫారెస్ట్ పరిధిలో బోరు వేయొద్దని సూచించారు. గ్రామస్తులు ఫారెస్టు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అక్కడే కూర్చొని నిరసన తెలిపారు. ఉన్నత అధికారులు స్పందించి బోరు వేయడానికి అనుమతి ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్దార్ పాపన్నగౌడ్ సేవలు చిరస్మరణీయం



వనపర్తిలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: మొఘల్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి 31 కోటలను జయించిన మహావీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పలువురు నాయకులు కొనియాడారు. సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆయన చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 12 మంది వీరులతో మొదలైన ఉద్యమం 18లక్షలకు చేరుకొని, ఆనాటి మొఘల్ సామ్రాజ్యంపై దండెత్తారని గుర్తుచేశారు. జమిందార్లు, జగీర్దార్లు అరాచకాలను ఎదిరించి పోరాడిన గొప్ప వీరుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు. దళిత, బహుజనులను ఏకం చేసి బహుజన రాజ్యాధికారం తీసుకొచ్చి, కొన్ని వందల ఏళ్ల క్రితమే గోల్కొండపై బహుజన జెండా ఎగురవేశాడన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్, బండారు శ్రీనివాస్‌గౌడ్, రాజారామ్‌ప్రకాశ్, రమేష్‌గౌడ్, బి.కృష్ణ, నాగన్న, గోద అంజనేయులుగౌడ్, తిరుపతయ్యగౌడ్, ఆనంద్‌గౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, నర్సింహులుగౌడ్, శ్రీలన్‌గౌడ్, అశోక్‌గౌడ్, రామన్‌గౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, అక్కి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



అమరచింతలో..



పెబ్బేరులో..



ఖిల్లాఘనపురం బస్టాండులో..



కదుకుంట్లలో..

బాధిత కుటుంబానికి పరామర్శ

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 21వ వార్డులో సుశీలమ్మ, 5వ వార్డులో పూల్యానాయక్ మంగళవారం మృతి చెందారు. ఈ మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, కౌన్సిలర్ వెంకటేష్, నాయకులు రవియాదవ్, వెంకటేష్ మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పి, ఎమ్మెల్యే అండగా ఉంటారని హామీ ఇచ్చారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు గోవింద నాయక్, తిరుపతి, రాజేష్ నాయక్, భరత్ నాయక్, శ్రీకాంత్ నాయక్, శ్రీను నాయక్, ఇంద్ర, నాగన్న, ఉదయ్, సురేష్ తదితరులు ఉన్నారు.

పెద్దకొత్తపల్లి: నారాయణపల్లి గ్రామానికి చెందిన బాల్‌చంద్రయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.10 వేలు, చెన్నపురావుపల్లి ఎంపీటీసీ రామచంద్రయ్య రూ.2 వేలు గ్రామస్తులకు ఇచ్చారు. ఈ మేరకు బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం నగదు అందజేశారు. శ్రీనివాసులు, మురళి, బాలపీర్, బాలు ఉన్నారు.

కొల్లాపూర్: పట్టణంలోని వివిధ వార్డుల్లో వేర్వేరు కారణాలతో మృతిచెందిన సీహెచ్ కృష్ణమూర్తి, బోయ బక్కనర్సింహ్మ కుటుంబాలను మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం పరామర్శించారు. మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట కౌన్సిలర్ డాక్టర్ బరిగెల రాముడుయాదవ్, నాయకులు వేణుగోపాల్‌యాదవ్, రెడ్డి సత్యం, ఎల్లగౌడ్, బరిగెల సత్యనారాయణ పాల్గొన్నారు.